

అన్నదాన భవనానికి విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి తటవర్తి వెంకన్న, వెంకట నాగశాంతి శోభ (భీమవరం) రూ.60,696 విరాళం సమర్పించారు.



బాలదుర్గమ్మ ఆలయానికి రూ.50 వేలు

దేవరపల్లి: స్థానిక బాలదుర్గమ్మ అమ్మవారి ఆలయానికి ఎంపీపీ కుప్పాల వెంకట కనక దుర్గారావు, వెంకటలక్ష్మి దంపతులు ఆదివారం రూ.50 వేల విరాళం అందజేశారు.

డెల్టాలకు 9 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 9 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

నేడు గ్రీవెన్స్ రద్దు

కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: గోదావరి పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నందు వల్ల ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద నీరు చేరింది. దీంతో దిగువకు వరద నీటిని విడుదల చేస్తున్నారు. ఆ పర్యవసానంగా వరద ప్రభావిత ప్రాంతాలలో జిల్లా, మండల గ్రామ స్థాయి అధికారులు, ఇతర ప్రభుత్వ సిబ్బంది సహాయక చర్యలలో ఉన్నందున సోమవారం జరగాల్సిన జిల్లా, డివిజన్, మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ ఎస్) రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

పవర్ లిఫ్టింగ్ జాతీయ స్థాయి విజేత అప్పన్న



అప్పన్నను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇటీవల మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో జరిగిన మాస్టర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ జాతీయ స్థాయి పోటీల్లో అమలాపురం హెల్త్ ఫిట్నెస్ జిమ్ క్రీడాకారుడు బి.అప్పన్న కాంస్య పతకాన్ని సాధించాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి మొట్ట మొదటిసారిగా మాస్టర్ జాతీయ స్థాయి మెడలిస్ట్‌గా అప్పన్న రికార్డు సృష్టించాడని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు అన్నారు. అప్పన్నను స్థానిక హెల్త్ ఫిట్‌నెస్ జిమ్‌లో ఆదివారం ఉదయం తోటి పవర్ లిఫ్టర్లు, బాడీ బిల్డర్లు ఘనంగా సత్కరించారు. జిల్లా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి, జిల్లా కోచ్ మట్టపర్తి సముద్రం, జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, అప్పన్న కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కొబ్బరి కాయల ఒలుపు రేట్లు పెంపు

అంబాజీపేట: ప్రతి రెండేళ్లకోసారి పెంచే కొబ్బరికాయల ఒలుపు రేట్ల పెంపుపై ఒలుపు కార్మికులు, యాజమాన్యాల మధ్య చర్చలు జరిగాయి. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నూతన రేట్లు అమలుకు రానున్నట్లు ఒలుపు కార్మిక సంఘాల సభ్యులు తెలిపారు. పెరుగుతున్న నిత్యవసరాల సరుకుల ధరలను దృష్టిలో ఉంచుకుని రేట్లు పెంచాలని కార్మికులు యాజమాన్యాలను కోరారు. ఈ మేరకు కుదిరిన ఒప్పందం ప్రకారం రూ.40కి పెంచినట్టు, ఈ ఏడాది ఆగస్టు నుంచి 2026 జూలై 31 వరకు పెంచిన రేట్లు అమలులో ఉంటాయని ఇరు వర్గాలు తెలిపారు.



పి.గన్నవరం మండలం బూరుగులంక వద్ద పడవపై వెళ్తున్న లంక గ్రామాల ప్రజలు



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతి



పి.గన్నవరం మండలంలో పశుగ్రాసాన్ని తీసుకు వెళ్తున్న రైతు

ఉగ్ర గోదారి

- లంకలను ముంచిన **వరద**
- గత వారం కన్నా వరద **ముంపు అధికం**
- భద్రాచలం వద్ద తగ్గుతు**న్నా** కోనసీమలో పెరుగుదల
- పి.గన్నవరం వద్ద పడవ బోల్తా పడి ఒకరి గల్లం**తు**
- పది రోజులుగా నీళ్లలోనే **వంట చేలు**
- ఉద్యాన పంటలకు మరి**ంత ముప్పు**



పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లిలో వరదనీటిలో ప్రయాణిస్తున్న ప్రజలు

సాక్షి, అమలాపురం: గోదావరి **మరోసారి ఉగ్రరూపం** దాల్చింది. ఎగువ నుంచి వస్తున్న **వరద నీరు దిగువన** జిల్లాలోని లంక గ్రామాలను ము**ంచెత్తుతోంది. గడిచిన** పది రోజులుగా జిల్లాలో గోదావ**రి లంక గ్రామాలకు** బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఏటిగట్టును ఆనుకుని ఉన్న లంకగ్రామాలు నీట మునిగాయి. వరద నీటిలోనే రాకపోకలు సాగుతున్నాయి. వరదతో వరి, ఉద్యాన, ఆక్వా రైతుల నష్టాలు పెరుగుతున్నాయి. ఆస్తి నష్టంతోపాటు ఇద్దరు వరదల్లో మృత్యువాత పడడం స్థానికులను ఆందోళనకు గురి చేస్తోంది.

గోదావరి పోటెత్తింది

భద్రాచలం వద్ద ఆదివారం ఉదయం ఆరు గంటల సమయానికి 53.20 అడుగుల ఎత్తు ఉన్న వరద సాయంత్రం ఆరు గంటల సమయానికి 49 అడుగులకు తగ్గింది. కాని ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఉదయం ఆరు గంటలకు 14.74 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తే సాయంత్రం ఆరు గంటల సమయానికి 15.90 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలారు. ఈ ప్రభావం దిగువ ప్రాంతాలపై చూపుతోంది. గౌతమీ, వృద్ధ గౌతమీ, వైనతేయ, వశిష్ఠ నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ముంపులోని లంక గ్రామాల్లో శనివారం కన్నా ఆదివారం సాయంత్రానికి అడుగున్నర నుంచి రెండు అడుగుల ఎత్తున వరద పెరిగింది. మరో రెండు అడుగులు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నెల 19న మొదలైన వరద ముంపు అంతకంతకూ కొనసాగుతూనే ఉంది.

- **పి.గన్నవరం మండలంలో వరద తీవ్రంగా ఉంది. జి.పెదపూడిలంక, ఊడిమూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక, ఎల్.గన్నవరం, జొన్నలలంకలకు స్థానికులు పడవల మీద ప్రయాణిస్తున్నారు. మండలాన్ని ఆనుకుని ఉన్న పశ్చిమ గోదావరి** జిల్లాలోని కనకాయిలంక, పుచ్చల్లంకలకు పడవల మీదే వెళ్లి వస్తున్నారు. అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం, పొట్టిలంక, కొండుకుదురులంక, అయినవిల్లిలంక, కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంకలలో వరద ముంపు కొనసాగుతోంది. మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వేపై వరద నీరు ప్రవహిస్తోంది. బి.దొడ్డవరం, అప్పనపల్లి, పెదపట్నంలంకల్లో వరద నీరు పెరిగింది. స్థానికులు వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. అంబాజీపేట నందంపూడి శివారు బొంతువారిపేటలో వరద నీరు చేరి ఇళ్లు మునిగాయి.
- ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాన్నేల్లంక నుంచి **గురజాపులంక వెళ్లే రహదారి వరద నీట మునిగింది. గురజాపులంక వాసులు పడవల మీద రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ ఇళ్లలోకి వరదనీరు చేరుతోంది ఠాన్నేల్లంక మత్స్యకార కాలనీలోకి వరద నీరు వచ్చింది. తాళ్లరేవు మండలం కొత్తలంక, ఐ.పోలవరం మం**డలం మురమళ్ల, కొమరిగిరి, ఎదుర్లంక, జి.మూలపాలెం ఏటిగట్టు దిగువున ఉన్న ఇళ్ల మధ్య ముంపు కొనసాగుతూనే ఉంది. కేశనకుర్రు పంచాయతీ పరిధిలోని పల్లెగూడెం, పొగాకులంక, జాంబావానిపేటల్లో వరద ముంపు నీరు ఇళ్ల మధ్యనే ఉంది.
- కె.గంగవరం మండలం కోటిపల్లి వద్ద మత్స్యకార కాలనీ ముంపులో చిక్కుకుంది. ఇళ్ల మధ్యకు వరద నీరు వచ్చి చేరింది. నదిని ఆనుకుని ఉన్న ఇళ్లలోకి వరద నీరు చేరింది. అల్లవరం మండలం బోడసకుర్రు పల్లిపాలెం మత్స్యకార కాలనీలో వరద నీరు పెరిగింది. ఇక్కడ 40 ఇళ్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లిలంక రేవును ఆనుకుని ఉన్న ఇళ్లు ముంపుబారిన పడ్డాయి. లాకుపేట సైతం నీట మునిగింది. టేకొట్టిపాలెం మత్స్యకార కాలనీ జలదిగ్బంధంలో చికుక్కుంది. అప్పనరామునిలంకలో కొత్తలంక, ఓఎన్జీసీ కాలనీ, పల్లిపాలెం వరద నీటిలో ఉన్నాయి.



అయినవిల్లి మండలం ముక్తేశ్వరం-అయినవిల్లిలంక కాజ్‌వే పై పడవల పై దాటు ప్రజలు

పది రోజులుగా వరద.. అడపాదడపా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు వరి, ఇతర వ్యవసాయ పంటలకు, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టాన్ని కలుగజేస్తోంది. నష్టం తీవ్రత పెరుగుతోంది. డెల్టాలో మురుగునీటి కాలువలు పొంగిపొర్లుతుండడంతో సుమారు ఐదు వేల ఎకరాల్లో చేలు నీట మునిగాయి. అలాగే లంక గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల్లో అరటి, కంద, కూరగాయ పంటలు నీట మునిగాయని అంచనా. మరో నాలుగు రోజుల పాటు ఇక్కడ వరద ముంపు ఉండనుంది. దీని వల్ల నష్టం మరింత పెరుగుతోందని రైతులు వాపోతున్నారు. పి.గన్నవరం, అయినవిల్లి, ముమ్మిడివరం, మామిడికుదురు లంకల్లో ఉద్యాన పంటలకు అధిక నష్టం జరుగుతోంది.

మంత్రుల పర్యటన

కె.గంగవరం మండలం కోటిపల్లిలో రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, కింజారపు అచ్చెన్నాయుడు, వాసంశెట్టి సుభాష్ పర్యటించారు. కోటిపల్లి మత్స్యకార ముంపు ప్రాంతాలను వారు పరిశీలించడంతో పాటు స్థానికులను పరామర్శించడంతో పాటు బాధితులకు అందుతున్న సాయంపై కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సుందరపల్లి వద్ద కోతకు గురవుతున్న ఏటిగట్టును వారు పరిశీలించారు.

ఒకరి గల్లంతు

గోదావరి వరదల సహాయక చర్యల్లో భాగంగా ఉడిముడి లంక గ్రామానికి బోటుపై తాగునీటి ప్యాకెట్లు, తాగునీటి క్యాన్ల ద్వారా సరఫరా చేసేందుకు తీసుకువెళ్తున్న బోటు ప్రమాదవశాత్తు బోల్తా కొట్టడంతో ఊడిముడి గ్రామానికి చెందిన చదలవాడ విజయ్ కృష్ణ (26) నదిలో గల్లంతయ్యాడు. దీనితో వరద మృతుల సంఖ్య ఇద్దరికి చేరింది. ఈనెల 25వ తేదీన అయినవిల్లి మండలం అయినవిల్లిలంకకు చెందిన గోడి శ్రీనివాసరావు (49) మృతిచెందిన విషయం తెలిసిందే. లైఫ్ జాకెట్లు లేక ఒకరు మృతి చెందడంతో పడవల మీద కాజ్‌వే దాటేవారు, లంకల్లోకి వెళ్లేవారు తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు వేసుకోవాలని, లేకుంటే పడవల్లోకి రానిచ్చేది లేదని పడవులు నడిపేవారు తేల్చి చెబుతున్నారు.

47 గ్రామాల్లో 16,182 బాధిత కుటుంబాలు

కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: జిల్లాలో గోదావరి వరదల వల్ల 12 మండలాల్లో 47 గ్రామాల్లో నివసిస్తున్న 16,182 కుటుంబాల వరద బాధితులకు సహాయక చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు సహాయక చర్యల్లో భాగంగా ముంపు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు జిల్లా మత్స్య శాఖ ద్వారా 73 మోటార్ పడవలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సేవలు అందిస్తున్నాయి. ఇప్పటి వరకు 293 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని తెలిపారు. 13 ఇళ్లు దెబ్బతినగా, 5030 మంది రైతులకు చెందిన 1596.48 ఎకరాల ఉద్యాన పంటలకు నష్టం జరిగిందన్నారు. 16182 మంది బాధితుల్లో 5780 మందికి బియ్యం, నిత్యావసర సరుకులు అందిచడం జరిగిందన్నారు.

రైల్వేలైన్‌పై మున్సిపాలిట్రిక్స్

- అలైన్‌మెంట్‌పై ఎమ్మెల్యే ప్రతిపాదనకు కౌన్సిల్ నో
- దానికీ, మున్సిపాలిటీకి సంబంధం ఏమిటని నిలదీత
- రైతుల గోడుకు కౌన్సిల్ బాధ్యత కారాదని నిర్ణయం
- కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించాలని తీర్మానం



అమలాపురం టౌన్: కోనసీమ రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి పట్టణేతర ప్రాంతాల నుంచి వెళ్లే లైన్ అలైన్‌మెంట్ మార్పు ప్రదిపాదన అంశంపై అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆసక్తికర చర్చ జరిగింది. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదేశాలతో అంటూ అలైన్‌మెంట్ మార్పు ప్రదిపాదనను కౌన్సిల్ పరోక్షంగా తిరస్కరించి దానిపై జరిగిన చర్చలో కౌన్సిలర్లు పలు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. చివరకు నిర్ణయాన్ని కలెక్టర్‌కు వదిలేస్తూ ప్రభుత్వానికి నివేదించాలని కౌన్సిల్ తీర్మానించింది. చర్చలో పాలక పక్ష కౌన్సిలర్ సంసాని బులినాని ఈ ప్రతిపాదన చర్చకు రాగానే అలైన్‌మెంట్ మార్పు మున్సిపాలిటీకి సంబంధమేంటని ప్రశ్నించారు. గ్రామాల మీదుగా రైల్వే లైన్ వెళ్లడానికి, దానికి మున్సిపాలిటీ ఆమోదం ఏమిటని కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర తదితరులు ప్రశ్నించారు. రైల్వే అలైన్‌మెంట్ రూపొందించినప్పుడు పట్టణం పక్క నుంచి రూరల్ మండలంలోని గ్రామాల మీదుగా 216 జాతీయ రహదారి రాలేదన్నది ఎమ్మెల్యే వాదన. పట్టణానికి తూర్పు వైపు మెడికల్ కళాశాల, రియల్ ఎస్టేట్ తదితర రంగాలు అభివృద్ధి చెందుతున్న క్రమంలో పట్టణానికి పశ్చిమ వైపు నుంచి మార్చాలని ఎమ్మెల్యే ప్రతిపాదించారు. ఇదే అంశాన్ని కౌన్సిల్ అజెండాలో 32 అంశంగా ఆమోదానికి ప్రయత్నించారు. దీనిని ఆమోదిస్తే రానున్న రోజుల్లో పశ్చిమం వైపు ఉన్న గ్రామాల రైతులు మున్సిపాలిటీపై కోర్టుకు వెళ్లే ప్రమాదం ఉందని, ఈ అపవాదు మున్సిపాలిటీకి వద్దని కౌన్సిలర్లు అభిప్రాయపడుతూనే ఎమ్మెల్యే ప్రతిపాదనను పరోక్షంగా తిరస్కరించి బాల్‌ను కౌన్సిల్ కోర్టు నుంచి నెట్టేశారు. పాత అలైన్‌మెంట్ ప్రకారం అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి, ఇమ్మిడివరప్పాడు, పేరూరు, అల్లవరం మండలం బోడసకుర్రు, మామిడికుదురు మండలం పాశర్లపూడి గ్రామాల్లో 201.351 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. కాగా కొత్త అలైన్‌మెంట్ అయినవిల్లి మండలం మాగాం, అమలాపురం రూరల్ మండలం ఎ.వేమవరం, బండార్లంక మీదుగా పేరూరు వై.జంక్షన్‌కు లైన్ వెళ్తుంది. ఇప్పుడు అలైన్‌మెంట్ మార్పు అంటే ఈ గ్రామాల రైతుల నుంచి అభ్యంతరాలు అనివార్యం అయ్యే పరిస్థితి ఉంటుందన్నది కౌన్సిల్ అభిప్రాయపడింది.

ఆషాఢ వియోగం అనురాగ తీరం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పెళ్లయిన కొత్త జంటలు తొలి ఆషాఢంలో అత్తారింటికి ఆమడ దూరాన ఉండాల్సిందే. అత్తారింట్లో అడుగుపెట్టాలంటే శ్రావణ మాసం వరకూ నిరీక్షణ తప్పదు. గోదావరి జిల్లాలు.. ఉత్తరాంధ్ర.. రాయలసీమ.. ప్రాంతమేదైనా దాదాపు అన్ని కుటుంబాల్లోని నవ దంపతులు తొలి ఆషాఢంలో అత్తారింటి గడప దాటడం లేదు. ఎన్నో ఏళ్లుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ పాటిస్తూనే ఉన్నారు. ఆధునిక పోకడలతో అక్కడక్కడ కొన్ని యువ జంటలు ఆషాఢ మాస సంప్రదాయాన్ని సవరణలతో సరిపుచ్చుతూ బంధువులు, స్నేహితులు ఇంటికి వెళుతున్నారు.



ఆషాఢంలో ఆమడ దూరాన కొత్త దంపతులు

నవవధువు నెలంతా పుట్టింటికే పరిమితం

ఇప్పటికీ సంప్రదాయాన్ని గౌరవిస్తున్న యువజంటలు

మొదటి ఆషాఢంలో దాంపత్యం మంచిది కాదంటున్న పండితులు

అత్తారింటి గడప దాటితే గండమనే భయం

వ్యవసాయ పనులు నిలిచిపోతాయనే ఈ నియమం

ఆచారం వెనుక ఎన్నో కారణాలు

- ✔ ఆషాఢ మాసంలో అత్తా.. అల్లుడు, అత్తా మామ.. కొత్త కోడళ్లు ఎదురు పడకూడదంటారు. నూతన దంపతులు అత్తారింటి గడప దాటకూడదని.. ఆచారాన్ని కాదని గడప దాటితే అత్త, మామలకు గండమని బలంగా నమ్ముతారు.
- ✔ పూర్వం కొత్తగా పెళ్లయిన యువకులు 6 నెలల పాటు అత్తారింట్లోనే ఉండే సంప్రదాయం నడిచేది. కష్టపడి పని చేయాల్సిన యువకులు అత్తవారింట్లో కూర్చుంటే వ్యవసాయ పనులు సకాలంలో జరగవు. వర్షాకాలంలో విత్తనాలు చల్లకపోతే సంవత్సరమంతా ఆకలితో మాడిపోవాల్సి వస్తుంది. అందుకే కొత్త కోడళ్ని తొలి ఆషాఢంలో పుట్టింట్లో ఉండాలని, అల్లుడు అత్తారింటి వైపు చూడకూడదనే నియమం పెట్టారు.
- ✔ పెళ్లయిన యువతికి అత్తారింట్లో కొత్తగా ఉంటుంది. ఈ పరిస్థితి ఆమెపై తీవ్ర ఒత్తిడి పెంచుతుంది. కాబట్టి.. కొన్ని రోజులు పుట్టింట్లో ఉంటే ఆమెకు కాస్త ధైర్యంగా ఉంటుందనే ముందుచూపుతో ఈ నియమం పెట్టారని చెబుతారు.
- ✔ ఆషాఢ మాసంలో వర్షాల వల్ల బ్యాక్టీరియా, వైరస్‌లు ప్రబలుతాయి. ఈ సమయంలో నవ వధువు గర్భం దాలిస్తే పుట్టబోయే బిడ్డపై దుష్ప్రభావం ఉంటుంది. పిండ దశలో తొలి మూడు నెలలు అత్యంత కీలకం. అవయవాలు ఏర్పడే ప్రక్రియ ప్రారంభమయ్యే ఈ నెలలో వధువు పుట్టింట్లో ఉండటమే క్షేమమని పెద్దలు ఈ ఆచారం పెట్టారంటారు.
- ✔ శ్రావణ మాసం దాదాపు అన్నీ మంచి రోజులే ఉంటాయి. ఆ శుభ ఘడియల్లో గర్భధారణ జరిగితే మంచిదని ఆషాఢ మాసంలో అత్తారింటికి దూరంగా పెట్టారంటారు.
- ✔ ఆషాఢంలో గర్భం దాలిస్తే తొమ్మిది నెలలకు చైత్రమాసం పూర్తవుతుంది. దీనివల్ల మండు వేసవి(మార్చి-ఏప్రిల్)లో ప్రసవం జరుగుతుంది. ఆ సమయంలో గ్రీష్మ తాపానికి పుట్టిన పిల్లలు, బాలింతలు తట్టుకోలేరనే ఉద్దేశంతో ఈ నియమం పెట్టారని కూడా చెబుతారు.
- ✔ కొత్త జంటలు పెళ్లయ్యాక ఒక నెల వియోగం ఉంటే అన్యోన్యమైన దాంపత్యాన్ని పొందుతారనే ఉద్దేశంతో కూడా ఈ నియమం పెట్టారంటారు. వైద్యులు సైతం ఈ విషయంలో వాస్తవం ఉందంటున్నారు.

ఆరోగ్య కారణాలతో పెట్టిన నియమం



పూర్వం ఆషాఢంలో అత్తారింటికి అల్లుళ్లు రాకూడదనేది ఆరోగ్య కారణాలతో పెట్టిన నిబంధన. వర్షాకాలంలో వాతావరణంలో వచ్చే మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతాయి. దంపతుల క్షేమంతో పాటు.. గర్భం ధరించే అవకాశం ఉన్న కారణంగా పుట్టే బిడ్డకు కూడా ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవాలనే ముందుచూపుతోనే ఇది పాటించాలని గట్టిగా చెబుతారు.

– పాణింగపల్లి శ్రీనివాస్ కిరణ్, ప్రధాన అర్చకులు, అంతర్వేది క్షేత్రం

వ్యవసాయ పనులకు ఇబ్బందనే..



వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగే సమయంలో ఆషాఢం వస్తుంది. పెళ్లైన కొత్త జంటలు వరుడు అత్తారింటికి వెళ్లి కూర్చుంటే ఈ పనులు ఆగిపోతాయి. అందుకే తొలి ఆషాఢంలో నవ దంపతులు అత్తారింటి గడప దాటకూడదనే నియమం పెట్టారు. పెళ్లయిన కొత్తలో అత్తాకోడళ్ల మధ్య సహజంగా కొంత పట్టింపులు ఉంటాయి. వాటి ప్రభావం గర్భిణీ, గర్భస్థ పిండంపై పడటంతో హాని జరిగే అవకాశం లేకపోలేదు. ఈ ప్రతికూల మాసంలో అత్తాకోడళ్లు ఒకచోట ఉండకూడదనేందుకు ఇది కూడా ఒక కారణం.

– సాలగ్రామ సుబ్రహ్మణ్యశర్మ, స్మార్త పురోహితుడు, కాకినాడ

నేడు సత్యదేవుని హుండీల ఆదాయం లెక్కింపు

అన్నవరం: సత్యదేవుని హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించనున్నారు. ఉదయం 8 గంటలకు హుండీలు తెరచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశామని దేవస్థానం అధికారులు తెలిపారు. ఉదయం 7 గంటలకే దేవస్థానం సిబ్బంది అందరూ విధిగా హాజరు కావాలని ఈఓ కె.రామచంద్ర మోహన్ ఆదేశించారు. గత నెల 29న సత్యదేవుని హుండీ కానుకలు లెక్కించారు.

క్లుప్తంగా

మలయాళస్వామి బోధలు పాఠ్యాంశాలు కావాలి

సాహితీవేత్త జొన్నవిత్తుల



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ: ఏర్పేడు వ్యాసాశ్రమ స్థాపకుడు సద్గురు మలయాళ స్వామి 105 ఏళ్ల క్రితం అందించిన సందేశాన్ని పాఠ్యాంశంగా తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రముఖ సాహితీవేత్త, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. స్వామి బోధనలు సమగ్ర గ్రంథావళి, శుష్క వేదాంత తమో భాస్కరం పుస్తకాలలో కీలక అంశాలను మోక్షానికి అర్హత–కులమా? గుణమా? శీర్షికన హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పాత్రికేయుడు జి.వల్లీశ్వర్ సులభ శైలిలో తిరిగి రాశారు. ఆదివారం ఈ పుస్తకావిష్కరణ నగరంలోని రివర్ బే ఆహ్వానం ఫంక్షన్ హాలులో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జొన్నవిత్తుల ఈ పుస్తకాన్ని ఆవిష్కరిస్తూ రామాయణ, మహాభారతాలు మన రక్తంలో అంతర్వాహినిగా ఉన్నాయని, అందుకే ఇన్ని కులాలు ఉన్నప్పటికీ అందరూ ఐక్యంగా ఉంటున్నామన్నారు. వివిధ కారణాలతో కులాలను రెచ్చగొట్టడాలకు అడ్డుకట్ట వేయడానికే సద్గురు మలయాళ స్వామి లాంటి మహనీయులు తమ బోధనలతో ప్రజలను జాగృతం చేశారన్నారు. ఆయన బోధనలు 8వ తరగతి నుంచి డిగ్రీ వరకు పాఠ్యాంశాలుగా రావాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ ఐక్యంగా ఉంటూ అమృత కలశం లాంటి హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని జొన్నవిత్తుల సూచించారు. ప్రముఖ సామాజిక కార్యకర్త పోలుకొండ వెంకట శ్రీనివాస్, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కర్రి రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరిశ్చంద్ర ప్రసాద్‌కు నివాళి



తణుకులో రక్తదానం చేస్తున్న ఆంధ్రా సుగర్స్ సంస్థ ఉద్యోగులు

తణుకు: దివంగత పారిశ్రామికవేత్త డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ 104వ జయంతి వేడుకలను ఆదివారం ఆంధ్రా సుగర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ చైర్మన్, ఎండీ పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి, డైరెక్టర్లు వీఎస్ రాజు, డాక్టర్ డి.మంజులత, పి.వెంకటేశ్వరరావు, జీఎస్‌వీ ప్రసాద్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ముళ్లపూడి నరేంద్రనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పెండ్యాల ఎస్ఆర్‌వీకే రంగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, ముళ్లపూడి వెంకటరమణమ్మ మెమోరియల్ ఆసుపత్రి సౌజన్యంతో సుమారు 400 మందికి పైగా కంటి పరీక్షలు చేశారు. అలాగే 25 ఏళ్లకు పైగా సేవలందించిన 96 మంది ఉద్యోగులను యాజమాన్యం ఘనంగా సత్కరించింది. అనంతరం సంస్థ హెచ్ఆర్ జీఎం ఎ.సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఎండీ పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కార్యదర్శి పీవీఎస్ విశ్వనాథ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఊడిమూడిలంక బోటు ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డ ఐదుగురు వ్యక్తులు



పడవలపై వెళ్లి రక్షించిన హెచ్‌సీ మురళీకృష్ణ, పడవ నడిపే వ్యక్తులు



గల్లంతైన విజయకృష్ణ తండ్రి మంచంపైనే రోదిస్తున్న దృశ్యం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

లైఫ్ జాకెట్లే కాపాడాయి..

- ప్రాణాలతో బయటపడ్డ ఐదుగురు వ్యక్తులు
- ఒక యువకుడి గల్లంతు
- ఊడిమూడిలంక వద్ద వాటర్ ప్యాకెట్లు తరలిస్తున్న బోటు బోల్తా

పి.గన్నవరం: లైఫ్ జాకెట్లు ధరించడం వల్లే తాము ప్రాణాలతో ఉన్నామని ఊడిమూడిలంక వద్ద పడవ ప్రమాదం నుంచి బయటపడిన వ్యక్తులు తెలిపారు. మండలంలోని ఊడిమూడిలంక వద్ద ఆదివారం వరద బాధితులకు వాటర్ ప్యాకెట్ల బస్తాలు తరలిస్తున్న ఇంజిన్ బోటు వశిష్ఠ నదీపాయలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒక యువకుడు గల్లంతు కాగా, ఐదుగురు వరద ఉధృతిలో కొట్టుకుపోయి చెట్ల కొమ్మలను పట్టుకున్నారు. దీంతో రెండు బోట్లలో వెళ్లి వారిని రక్షించి, బూరుగులంకకు తీసుకువచ్చారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజల కోసం ఉచ్చులవారిపేట ఏటిగట్టు నుంచి వాటర్ ప్యాకెట్ల బస్తాలు తరలిస్తున్నారు. ఆదివారం ఏటిగట్టు వద్ద సుమారు 200 వాటర్ ప్యాకెట్ల బస్తాలు ఇంజిన్ బోటులో లోడ్ చేసినట్టు వారు తెలిపారు. బోటు నడుపుతున్న ఊడిమూడిలంకకు చెందిన మద్దా మురళి, ఊడిమూడి పెదపేటకు చెందిన కూలీలు నేలపూడి యోహాన్, నేలపూడి వెంకటేశ్వరరావు, గిడ్డి సత్యనారాయణ, పీడబ్ల్యూఎస్ వర్కర్ గిడ్డి ఈశ్వర్ లైఫ్ జాకెట్లు ధరించారు. పెదపేటకు చెందిన మరో కూలీ చదలవాడ విజయకృష్ణ (27) లైఫ్ జాకెట్ ధరించలేదన్నారు. వీరంతా బోటులో ఊడిమూడిలంకకు బయల్దేరారు. ఏటిగట్టు నుంచి 25 మీటర్ల దూరం వెళ్లే సరికి బోటు అదుపు తప్పి నీట మునిగిపోయింది. ఈత వచ్చిన ఈశ్వర్ తన లైఫ్ జాకెట్‌ను విజయకృష్ణకు అందించగా, అతడు సరిగా ధరించలేకపోయాడని తెలిపాడు. దీంతో విజయకృష్ణ నీట మునిగి గల్లంతయ్యాడు. మిగిలిన ఐదుగురూ వరద ఉధృతిలో ఒకటిన్నర కిలోమీటర్ల దూరం కొట్టుకుపోయి అక్కడ ఉన్న చెట్ల కొమ్మలను పట్టుకున్నారు. ఒడ్డున ఉన్న అంబేడ్కర్ అనే వ్యక్తి బోటు మునిగిపోవడాన్ని గమనించి బూరుగులంక రేవులో పడవ నడిపే వ్యక్తికి సమాచారం అందించాడు. దీంతో హెచ్‌సీ బి.మురళీకృష్ణ, కంటంశెట్టి రాజు, చిన్నం శ్రీను, చీకరమెల్లి రామచంద్రరావులతో కలిపి రెండు బోట్లలో హుటాహుటిన వెళ్లి చెట్లను పట్టుకుని ఉన్న ఐదుగురినీ రక్షించారు. గల్లంతైన యువకుడి కోసం ఎన్‌డీఆర్ఎఫ్ దళాలు నాలుగు బోట్లపై గాలిస్తున్నాయి. ప్రమాద స్థలాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ, డీఎస్పీ కేవీ రమణ తదితరులు పరిశీలించారు. అధికారులు సహాయక చర్యలను సమీక్షిస్తున్నారు.

జీవనాధారం కోల్పోయిన కుటుంబం

బోటు ప్రమాదంలో ఊడిమూడికి చెందిన చదలవాడ విజయకృష్ణ గల్లంతవడంతో అతడి కుటుంబం తమ జీవనాధారాన్ని కోల్పోతామని ఆందోళన చెందుతోంది. తండ్రి వెర్రియ్య ఎనిమిదేళ్లుగా రెండు కాళ్లు పనిచేయక పోవడంతో మంచాన పడ్డాడు. ఆయనతో పాటు తల్లి పార్వతి, 22 ఏళ్ల చెల్లెలు ఉన్నారు. బీటెక్ చదివిన విజయకృష్ణ తండ్రి అనారోగ్యం కారణంగా ఇక్కడే ఉంటూ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడు గల్లంతవడంతో భోరున విలపిస్తున్నారు.

ప్రమాదం దురదృష్టకరం: కలెక్టర్

గల్లంతైన వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షల సాయం

ఊడిమూడి వద్ద బోటు ప్రమాదం ఘటన దురదృష్టకరమని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. ఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బోటును సరైన మార్గంలో తీసుకువెళ్లకపోవడం వల్ల మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ప్రమాదం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రమాదం నుంచి ఐదుగురు సురక్షితంగా బయటపడగా విజయకృష్ణ గల్లంతు కావడం దురదృష్టకరమన్నారు. జీవనాధారం కోల్పోయిన విజయకృష్ణ కుటుంబానికి తక్షణ సాయంగా రూ.5 లక్షల చెక్కును సోమవారం అందజేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట జేసీ నిశాంతి ఉన్నారు.

ట్రీట్‌మెంట్‌కు వెళ్లిన తల్లికి పనిష్మెంట్

- తనయుడి తప్పుకి తల్లికి వైద్యం నిరాకరణ
- శస్త్ర చికిత్స చేయకుండా జీజీహెచ్ నుంచి డిశ్చార్జి



బాధితురాలు జువ్వాది లక్ష్మి

గోకవరం: కుమారుడు చేసిన చిన్న తప్పిదానికి అతని తల్లికి వైద్య సేవలను నిరాకరించిన ఘటన కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు గోకవరానికి చెందిన జువ్వాది లక్ష్మి ఇటీవల అనారోగ్యానికి గురై రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. అక్కడ స్కానింగ్ చేసి గర్భసంచిలో కణితి ఉందని నిర్ధారించి శస్త్ర చికిత్స అవసరమని సూచించారు. కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందుతాయని తెలిసిన వారు చెప్పడంతో కుమారుడు సాయిరాం ఈనెల 16న తల్లిని అక్కడకు తీసుకువెళ్లారు. సుమారు 10 రోజుల పాటు కాకినాడ ప్రభుత్వాస్పత్రి జనరల్ వార్డులోనే ఉండి పరీక్షలు చేయించుకున్నారు. ఈ క్రమంలో ఈనెల 24న కుమారుడు సాయిరాం అస్వస్థతకు గురై జనరల్ వార్డులో ఖాళీగా ఉన్న బెడ్‌పై విశ్రాంతి తీసుకున్నాడు. ఇంతలో వార్డులో ఉన్న వైద్య సిబ్బంది అక్కడకు వచ్చి అతనిపై తీవ్రంగా మండిపడ్డారు. అనంతరం ఈ నెల 26న లక్ష్మికి శస్త్ర చికిత్స చేయకుండా అర్ధంతరంగా ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. అస్వస్థతకు గురై బెడ్ మీద విశ్రాంతి తీసుకున్నానని, తెలియక చేసిన తప్పునకు తన తల్లికి శస్త్ర చికిత్స నిలిపివేయొద్దని వేడుకున్నా వైద్య సిబ్బంది కనికరించలేదని కుమారుడు వాపోయాడు. తన తల్లి తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతోందని, దీనిపై వైద్య సిబ్బందికి ఫోన్ చేసి మాట్లాడితే రెండు వారాల తరువాత వచ్చి తమను బతిమలాడుకుంటే శస్త్ర చికిత్స చేస్తామని చెబుతున్నారని ఆవేదన చెందుతున్నాడు. ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగేలా ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు చేపట్టి బాధితురాలికి శస్త్ర చికిత్స చేసి మెరుగైన వైద్య సేవలందించాలని డిమాండ్ చేస్తున్నారు.

యువకుల దాడిలో వ్యక్తి మృతి

- ఐదుగురికి గాయాలు
- తలుపులమ్మ లోవకు వెళ్తుండగా కాకినాడలో ఘటన



గాలి దేముడు (ఫైల్)



దేముడు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ముమ్మిడివరం/బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): నగర పంచాయతీ సోమిదేవరపాలెం చిన్న ఉందుర్తి వారిపేటకు చెందిన వారు తలుపులమ్మ లోవ వెళ్తుండగా కొందరు దాడి చేసిన ఘటనలో ఒకరు మృతి చెందగా ఐదుగురు గాయపడ్డారు. చిన్న ఉందుర్తి వారిపేటకు చెందిన 12 మంది టాటా మేజిక్ వాహనంలో శనివారం రాత్రి తలుపులమ్మ లోవకు బయలుదేరారు. అర్ధరాత్రి కాకినాడ మునసబు గారి తూము సెంటర్‌లోని శివాలయం సమీపంలో ముగ్గురు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి టాటా మ్యాజిక్ వాహనాన్ని ఆపి కోరంగి శివాలయం వద్ద మమ్మల్ని ఢీకొట్టింది మీరేనా అని ప్రశ్నించి, మీతో పాటు ఉన్న మరో రెండు వాహనాలు ఎక్కడంటూ నిలదీస్తూనే, ఎవరికో ఫోన్ చేసి మరికొందరు యువకులను అక్కడకు రప్పించారు. వారంతా కలిసి ఆ వాహనం అద్దాలు పగల గొట్టారు. వ్యాన్‌లోని వారు కిందకు దిగుతుండగానే వారిపై రాళ్లతో దాడి చేసి పరారయ్యారు. ఈ దాడిలో చాట్ల గాలి దేముడు (46) తీవ్రంగా గాయపడగా మరో ఐదుగురు గాయపడ్డారు. వారిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా గాలి దేముడు మృతి చెందాడు. ఉందుర్తి సాయి రామకృష్ణ, ఉందుర్తి దుర్గా ప్రసాద్, ఉందుర్తి వెంకట కుమారస్వామి, కుడుపూడి శ్రీనివాసరావు, మట్టపర్తి నాగేశ్వరరావు కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాలి దేముడు మృతితో ఆ గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. గాలి దేముడు ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. అతడికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు నితిన్ పూర్తిగా దివ్యాంగుడు, రెండో కుమారుడు శ్రీరామ్‌కు వివాహమైంది. దేముడు మృతితో ఆ కుటుంబం ఆధారం కోల్పోయింది. కాగా సంఘటన జరిగిన వెంటనే స్పందించిన పోలీసులు 11 మందిని అదుపులోనికి తీసుకొన్నారు. దీనిలో ఒక మైనర్ బాలుడు కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దీనిలో ఎటువంటి రాజకీయ కోణం లేదని కాకినాడ డీఎస్పీ హనుమంతరావు విలేకర్లకు తెలిపారు. సంఘటన జరిగిన వెంటనే స్పందించిన వన్‌టౌన్ పోలీసుల పనితీరును ఆయన అభినందించారు. వన్‌టౌన్ సీఐ సురేష్‌కుమార్, క్రైమ్ సీఐ చిట్టిబాబు బృందం కేసును ఛేదించడంలో బాగా పనిచేశారన్నారు.



రామవరంలో రాజు భార్య భాగ్యలక్ష్మి, ఆ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

ఇంకెంత మందిని బలి చేస్తారు?

- కూటమి నేతల వేధింపుల వల్లే రాజు మృతి
- బీజేపీ, ఎన్డీఏ కూటమి నాయకులపై మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ధ్వజం

పెదపూడి: అనపర్తి నియోజకవర్గంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకుల అనుచరుల వేధింపుల వల్లే రామవరం ఎంపీటీసీ సభ్యురాలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి భర్త వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి (రాజు) మృతి చెందారని మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వారి వేధింపులకు మానసికంగా కుంగిపోయి గుండెపోటుకు గురయ్యారని ఆయన అన్నారు. రామవరంలో శనివారం ఎంపీటీసీ భాగ్యలక్ష్మి కుటుంబాన్ని ఆయనతో పాటు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ జాయింట్ సెక్రెటరీ సత్తి సుబ్బిరెడ్డి, గౌతమి సంస్థల అధినేత సత్తి రామకృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఆదాడి చిన సత్యనారాయణ తదితరులు పరామర్శించారు. అనంతరం సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం నియోజకవర్గంలో పలు గ్రామాలతో పాటు ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో రామవరం గ్రామం వైఎస్సార్ సీపీకి మెజారిటీ ఇచ్చిందనే కక్షతో ఆ గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అనేక రకాలుగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకులు, వారి అనుచరులు దాడులకు దిగారన్నారు. ఆ క్రమంలో ఎంపీటీసీని బీజేపీలో చేర్పించాలని, అంతేకాక గతంలో వైఎస్సార్ సీపీ తరపున సోషల్ మీడియాలలో పెట్టిన రాజుతో కొన్నింటికి క్షమాపణ పోస్టులను బలవంతంగా పెట్టించారన్నారు. అలాగే గ్రామంలో గతంలో ఆంజనేయస్వామి గుడి వద్ద నూతనంగా నిర్మించిన ఒక రోడ్డుకు వైఎస్సార్ మార్గ్ అని పేరు పెట్టారని, తాజాగా ఆ పేరును అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో గురువారం అధికారులు తొలగించారు. స్వతహాగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వీరాభిమాని అయిన రాజు మరింత కుంగిపోయి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ నాయకులు ఇంత దారుణాలు చేస్తున్నారని గ్రామంలో తన మిత్రులు అనుచరుల దగ్గర చెబుతూ బాధపడి మానసిక క్షోభతో శనివారం తీవ్ర గుండెపోటుకు గురై మృతి చెందారని ఆరోపించారు. రాజు మరణానికి బీజేపీ, ఎన్డీఏ కూటమి నాయకుల వేధింపులే కారణమని గ్రామంలో ఇంకా మరి కొంత మంది వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను పలు అంశాలలో ఇంకా వేధిస్తున్నారని, ఈ పరిణామాలు ఎంతవరకు దారితీసి ఇంకా ఎంతమందిని పొట్టన పెట్టుకుంటారో సూర్యనారాయణ రెడ్డి ఆరోపించారు.

మార్కొండపాడులో చోరీ

- బంగారు, వెండి వస్తువులతో పాటు రూ.60 వేల నగదు అపహరణ

చాగల్లు: మండలంలోని మార్కొండపాడు గ్రామంలో ఓ ఇంట్లో సుమారు 30 కాసుల బంగారు అభరణాలు, 9 కిలోల వెండి వస్తువులు, నగదు చోరీకి గురైన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కిరాణా వ్యాపారి ఉదయగిరి పద్మనాభం ఈనెల 23న తన భార్య బేబీరాణితో కలిసి హైదరాబాదులోని తన కుమార్తె పుట్టినరోజు కార్యక్రమానికి వెళ్లారు. వారు తిరిగి ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి గేటు తాళం వేసి ఉంది కానీ, ఇంటి తలుపు తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా లోపల బీరువా తాళాలు పగులగొట్టి అందులోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. అందులో ఉండాల్సిన సుమారు 30 కాసుల బంగారు వస్తువులు, 9 కిలోల వెండి వస్తువులు, రూ.60 వేలు నగదు చోరీకి గురైనట్టు వారు గ్రహించారు. వెంటనే పద్మనాభం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై పి.నాగరాజు కేసు నమోదు చేశారు. ఘటన స్థలానికి సీఐ శ్రీనివాసరావు, ఎస్సై పి.నాగరాజు, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం వచ్చి పరిశీలించారు. సొత్తు విలువ సుమారు రూ.10.5 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

చోరీ సొత్తు స్వాధీనం : వ్యక్తి అరెస్టు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో నడుస్తున్న రైళ్లలో చోరీలకు పాల్పడే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రైళ్లలో ప్రయాణిస్తున్న, నిద్రపోతున్న వారి నగలు, బ్యాగ్‌ల చోరీకి పాల్పడుతున్న అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం, గోలిచెర్ల గ్రామానికి చెందిన మొల్లి గణేష్ వెంకట శివ అనే నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ విజయ శంకర్ ఆదివారం తెలిపారు. ఆదివారం జీఆర్పీ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాలుగు కేసులలో పట్టుబడ్డ రూ.6,72,360 విలువైన 104 గ్రాముల బంగారు ఆభరణాలు, పది ఆండ్రాయిడ్ మొబైలు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

మందుబాబుల హల్‌చల్

- మంత్రి వాసంశెట్టి కాన్వాయ్ అడ్డగింత
- రంగా అనుచరులమంటూ బెదిరింపులు

కె.గంగవరం: మండలంలోని మసకపల్లి–భట్లపాలిక గ్రామాల మధ్యలో ఏటిగట్టు మీద కొంత మంది మందుబాబులు చేసిన రుబాబు హల్‌చల్‌గా మారింది. యానాం మద్యం తాగి అరుగురు యువకులు చేసిన వీరంగం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. యానాంలో మద్యం తీసుకుని మధ్యలో వారు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కాన్వాయ్ అడ్డుకుని ఇబ్బందికి గురిచేశారు. కె.గంగవరం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రికి చెందిన కొందరు యువకులు తాళ్లరేవు మండలం మట్లపాలెం లక్ష్మీదేవి గుడికి వెళ్లారు. మందు తాగకూడదని మొక్కుకున్న కడియాన్ని తీసేసి అనంతరం యానాంలో మద్యం తాగారు. తిరిగి ఏటిగట్టు మీదుగా రావులపాలెం వెళ్లిపోతున్న సమయంలో వారు మసకపల్లి, భట్లపాలిక ఏటిగట్టు మీద కూర్చుని వారు వచ్చిన ఆటోనే రోడ్డుకు అడ్డంగా పెట్టారు. అదే సమయంలో మంత్రి సుభాష్ వరద బాధితులను పరామర్శించి కాన్వాయ్‌లో వస్తున్నారు. వారి కంటే ముందు వచ్చిన కె.గంగవరం ఎస్సై ఆటోను గమనించి వాహనాన్ని తీయాలని కోరినప్పటికీ వారు నిరాకరించారు. దీంతో ఎస్సై వారిని వారించి పక్కకు తోశారు. దీంతో ఆ యువకులు మంత్రి కాన్వాయ్‌కు అడ్డంగా పడుకుని 'మేము రంగా మనుషులం. మమ్మల్నే అడ్డుకుంటారా' అంటూ వీరంగం చేశారు. ఈ సమయంలో సుభాష్ కారులోనే ఉండిపోయారు. పరిస్థితిని గమనించిన సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు వారిని స్టేషన్‌కు తీసుకువచ్చి అరెస్టు చేసినట్లు ఎస్సై జానీ బాషా విలేకరులకు తెలిపారు. శనివారం రాత్రి జరిగిన ఘటనపై పోలీసులు అప్రమత్తమయ్యారు. రామచంద్రపురంలోని మంత్రి సుభాష్ ఇంటి వద్ద పోలీస్ భద్రతను పెంచారు.



మంత్రి కాన్వాయ్‌కు అడ్డంగా పడుకున్న మందుబాబులు